17 వ వసంతంలోకి
# సూర్య
రంగారెడ్డి-వికారాబాద్-మేడ్చల్
సోమవారం 11 డిసెంబర్ 2023 | పేజీలు : 8

## నేడు ప్రజావాణి కార్యక్రమం : కలెక్టర్ భారతి హోళికేరీ



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో గత కొంత కాలంగా తాత్కాలికంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే ఈ కార్యక్రమం నేటి నుంచి యాదావిథంగా నిర్వహించడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళికేరీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

## కొత్త సర్కారుకు...

# సమస్యల స్వాగతం

- ఎమ్మెల్యే సారు మారే... సర్కారు మారే.! ఇకనైనా మండల సమస్యలు తీరునో.?
- మాడ్గుల మండలంలో దశాబ్దాలుగా వంతెనలకు నోచుకోని రహదారులతో ప్రజల అవస్థలు
- గిరిజన తాండాలు, మారుమూల గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం హామీలు, శంకుస్థాపనలకే పరిమితం
- యేండ్లు గడుస్తున్నా పూర్తికాని కెఎల్ఐ, డిఎల్ఐ కాలువల నిర్మాణం
- నేటికీ కొన్ని గ్రామాలలో పరిహారం కొరకు పడిగాపులు కాస్తున్న భూ నిర్వాసిత రైతులు

మాడ్గుల, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : కల్వకుర్తి నియోజకవర్గం మాడ్గుల మండలంలో గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు మొదలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల హాయం వరకు యేండ్లు గడుస్తున్నా ప్రజలకు అవసరమైన ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోక తీవ్ర ఇబ్బందుల్లో మగ్గుతున్నారు. ఎన్నికల సమయంలో పలు రాజకీయపార్టీల నాయకులు ఇబ్బడిముబ్బడిగా మండల సమస్యల పరిష్కారానికి హామిలు ఇస్తున్నప్పటికి దశాబ్దాలు గడిచినా ఎక్కడ వేసినా గొంగళి అక్కడే అన్న చందంగా మాడ్గుల మండలంలోని వివిధ గ్రామాలు, గిరిజన తాండాలకు నేటికి సరైన బిటిరోడ్డు వసతి లేకపోగా అంతర్ మండలంతో పాటు రంగారెడ్డి, నల్లగొండ, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాల మధ్య రాకపోకలకు అవసరమైన వివిధ గ్రామాల మధ్య వాగులపై వంతెనల నిర్మాణం లేక వర్షాకాలంలో మండల ప్రజలు అనేక అవస్థల మధ్య దూరభారంతో కూడిన ప్రయాణాలు సాగిస్తున్నారు. అదే విధంగా మండల బీడు భూములను సస్యశ్యామలం గావించేందుకు చేపట్టిన డిండి లిఫ్ట్ ఇరిగేషన్, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ వంటి సాగునీటి కాలువలు యేండ్లు గడుస్తున్నా అసంపూర్తిగా మిగిలి కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండలం పూర్తిగా వెనుకబడ్డ ప్రాంతం. గతంలో 16 గ్రామపంచాయతిలుండి

మిగతా 2లో



నర్సంపల్లి - గిరికొత్తపల్లి గ్రామాల మధ్య వాగులో వంతెన లేని మట్టిరోడ్డు దుస్థితికి నిదర్శనం ఈ దృశ్యం

## ప్రజా క్షేత్రంలో గెలుపోటములు సహజమే

### మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి



తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శిస్తున్న సీఎం ఎ.రేవంత్‌రెడ్డి

కొడంగల్ రూరల్, మేజర్‌న్యూస్, (డిసెంబరు 10) : ప్రజాక్షేత్రంలో గెలుపోటములు సహజమే...వ్యక్తిగత వైరుధ్యాలు ఉండకూడదు అనే దానికి...తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను కొడంగల్ ఎమ్మెల్యే, సీఎం ఎ.రేవంత్‌రెడ్డి పరామర్శించడం నిదర్శనమని చెప్పవచ్చును. ఇటీవలే ప్రమాదవశాత్తు గాయపడిన మాజీ సీఎం కేసీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో సీఎం ఎ.రేవంత్‌రెడ్డి పరామర్శించారు. రాజకీయంగా వైరం ఉన్నా... వ్యక్తిగతంగా ఉండకూడదని సీఎం రేవంత్‌రెడ్డి నిరూపించారని నెటిజన్‌లు మెచ్చుకుంటున్నారు.

## ప్రజలకు మంచి చేస్తే స్వాగతిస్తాం

### కొత్త ప్రభుత్వంపై చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కామెంట్



చేవెళ్ల, మేజర్‌న్యూస్(డిసెంబర్ 10) : ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తే స్వాగతిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకం సేవలను ఆదివారం చేవెళ్లలో ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకాలను స్వాగతిస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న

మిగతా 2లో



# మనకు మంచి రోజులొచ్చాయ్

- త్వరలో వికారాబాద్ అభివృద్ధికి నిధులు తెస్తా
- వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్ రూరల్, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : వికారాబాద్ ప్రాంతానికి మంచి రోజులు వచ్చాయని తొందరలోనే వికారాబాద్ అభివృద్ధికి నిధుల వరద తెస్తామని వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలలో భాగంగా మొట్టమొదట ప్రకటించిన మహాలక్ష్మి పథకం, రాజీవ్ ఆరోగ్య శ్రీ భీమా, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మరో 90 రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలు మమ్మల్ని నమ్మి గెలిపించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు మంచి పాలన అందించే ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, వికారాబాద్ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ అర్థ సుధాకర్ రెడ్డి, నాయకులు ఎర్రవల్లి జాఫర్, అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు మంచి చేస్తే స్వాగతిస్తాం



**మొదటిపేజీ తరువాయి...** సమయంలో కూడా పేదలకు మేలు జరిగేలా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఒక్క చేవెళ్ల నియోజకవర్గానికి రూ. 12.60కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆర్డీవో సాయిరాం, ఎంపీపీ విజయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు అవినాష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ రంగారెడ్డి, సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, ఎంపీటీసీ రాములు, సోసైటి చైర్మెన్ దేవర వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పామెన భీంభరత్, సత్యనారాయణరెడ్డి, ఆగిరెడ్డి తదితరులు ఉన్నారు.

**_బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం_**

ఆయా పథకాల ప్రారంభోత్సవం సందర్భంగా చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారిక కార్యక్రమం గురించి తమకు సమాచారం ఇవ్వలేదంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ విషయంలో రగడ జరిగింది. దీంతో ఇరు పార్టీల నాయకులు పోటాపోటిగా నినాదాలు చేయడంతో గందరగోళం నెలకొంది.

## హ్యాట్రిక్ ఎమ్మెల్యే యాదయ్యకు శుభాకాంక్షల వెల్లువ



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా 3వ సారి విజయం సాధించిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు గొల్లపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి శాలువ కప్పి పూల బొకెలతో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... చేవెళ్ల ప్రజలు అభివృద్ధి చేసే నాయకున్ని గర్తించి ఎన్నుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీ సత్యంగౌడ్, విగ్నేష్‌గౌడ్, పెంటయ్య, కృష్ణ, పృద్విగౌడ్, రామకృష్ణ, సురేందర్‌గౌడ్, నరేష్‌గౌడ్, వినయ్‌కుమార్, రాజు, మాణిక్యం, మల్లేష్ తదితరులు ఉన్నారు.

## ఎస్ఐని కలుసుకున్న కాంగ్రెస్ నాయకులు



కేశంపేట్, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : పోలీసులకు పూర్తిస్వేచ్ఛ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉంటుందని, అధికారులు, సిబ్బంది బాధితుల పక్షాన నిలబడి న్యాయం ధర్మం పాటించాలని లేమామిడి కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం కేశంపేట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ వరప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకేలు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోనూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి షాద్ నగర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన వీర్లపల్లి శంకర్ గెలుపొందిన సందర్భంగా అధికారులతో కలవడం జరిగిందన్నారు. పోలీసులు న్యాయం ధర్మం వైపు నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలలో మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా పోలీసులు వీధి నిర్వహణ చక్కగా నిర్వహించారని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ప్రకాష్ గౌడ్, గ్రామ కమిటి అధ్యక్షుడు సంపంగి ఆంజనేయులు, నిర్మల్, కుమార్, టి.ఆంజనేయులు, కృష్ణయ్య తదితరులు కలిశారు.



అయ్యప్ప స్వామి 18వ మహాపడిపూజా కార్యక్రమాన్ని మదుసూదన్ గురుస్వామి, కేశవ్‌గురు స్వామిల ఆధ్వర్యంలో ప్రశాంత్ గురుస్వామి ఘనంగా నిర్వహించారు. మహా పడిపూజా కార్యక్రమంలో వందలాది మంది అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. **– _మేజర్‌న్యూస్, గండిపేట్._**

# కొత్త సర్కారుకు సమస్యల స్వాగతం



సుద్దపల్లి వాగులో వరదనీటికి కొట్టుకుపోతున్న ద్విచక్ర వాహనం (ఫైల్)



మాడ్గుల మండలంలో బిటికి నోచుకోని గిరిజనతాండ రహదారి



అన్నెబోయిన్‌పల్లి–కొత్తబ్రాహ్మణపల్లి మధ్య వాగులో వాహనదారుల ఇక్కట్లు

**మొదటిపేజీ తరువాయి...** ప్రస్తుతం కొత్త, పాతవి కలుపుకొని 33 గ్రామపంచాయతిలు ఉన్న ఈ మండలంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ఎస్‌డిఎఫ్, నియోజకవర్గ అభివృద్ధి నిధులతో కల్వకుర్తి తాజా మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ హాయంలో పలు గిరిజన తాండాల మధ్య బిటిరోడ్ల నిర్మాణాలకు శంఖుస్థాపనలు చేసినప్పటికి ఎక్కడ కూడ రవ్వంత పని జరుగలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా దొడ్లపహాడ్ – నాగిల్ల మధ్య, నాగిల్ల – అప్పారెడ్డిపల్లి మధ్య లింకురోడ్లు, ఫకీరతాండ నుండి ఆమనగల్లు–మాడ్గుల ప్రధాన రహదారి వరకు బిటిరోడ్డు లేక గోతులమయంగా మారిన రహదారుల్లోనే ప్రజలు ఇబ్బందుల మధ్య రాకపోకలు సాగిస్తున్నారు. అదే విధంగా ఆమనగల్లు ప్రధాన రహదారి నుండి తుర్కలకుంట, రెడ్డిపురం, చంద్రాయన్‌పల్లి వరకు, ఇదే ప్రధాన రహదారి నుండి మర్రిబండతాండ, తొడేలుగుండుతాండ , సంద్రాల్లగడ్డతాండ మీదుగా కలకొండ వరకు, కలకొండ నుండి శెనిగెలగుట్ట తాండ, కలకొండ – గోప్యతాండల మధ్య, ఇర్విన్–గాంగ్యనగర్ తాండతో పాటు ఇర్విన్ రెడ్డిపురం నుండి జాల్వంపుతాండ, చౌటకుంటతాండ, చెట్లగుట్ట తాండ మీదుగా నర్సంపల్లి చౌరాస్తా వరకు , అదే విధంగా నర్సంపల్లి చౌరాస్తా నుండి దుబ్బ తాండ, బావాజీతాండ మీదుగా మన్యతాండ వరకు, అదే విధంగా నర్సంపల్లి చౌరాస్తా నుండి జర్పులతాండ మీదుగా జంగుతాండ, మక్తతాండల బిటిరోడ్డు వరకు, కూభ్యతాండ నుండి చీన్యతాండల మధ్య బిటిరోడ్లు లేక ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

**_అందని ద్రాక్షగా వాగులపై వంతెనల నిర్మాణం_**

మాడ్గుల మండలంలోని వివిధ గ్రామాల మధ్య వాగులపై వంతెనల నిర్మాణం ప్రజలకు యేండ్లు గడుస్తున్నా నేటికి అందని ద్రాక్షగానే మిగులుతున్నది. ప్రధానంగా మాడ్గుల మండలం అందుగుల గ్రామ సమీపంలోని వాగుపై వంతెన నిర్మాణం లేక మండలంలోని వివిధ గ్రామాలు, తాండాల నుండి నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిరుసగండ ప్రధాన రహదారితో పాటు గిరికొత్తపల్లి మీదుగా ఇర్విన్ చేరుకునేందుకు, అదేవిధంగా అందుగుల నుండి నల్లగొండ జిల్లా ఇదంపల్లి మీదుగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వాగుపై వంతెన లేక వర్షాకాలంలో ఈ ప్రాంత ప్రజలు, వాహనదారులు సుమారు 25 కిలోమీటర్ల దూరభారంతో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ వాగును గతంలో జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, పలువురు ప్రజాప్రతినిధులు సందర్శించి ప్రజా ఇబ్బందులు గుర్తించినప్పటికి నేటికి ఎలాంటి ప్రగతికి నోచుకోలేదు. అదే విధంగా మండల పరిధిలోని అన్నెబోయిన్‌పల్లి – కొత్తబ్రాహ్మణపల్లి గ్రామాల మధ్య సుమారు 4 కిలోమీటర్ల మట్టిరోడ్డును బిటిగా మార్చి రెండు గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందిగా మారిన వాగుపై వంతెన నిర్మించాలని దశాబ్ధాల కాలంగా ఈ ప్రాంత ప్రజలు జిల్లా అధికారులు, ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా ఎవరకు పట్టించుకున్న దాఖలాలు లేవు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ మాత్రం అందుగుల, అన్నెబోయిన్‌పల్లి గ్రామాల మధ్య వాగుల మధ్య వంతెన నిర్మాణానికి ప్రజాప్రతి నిధులు, అధికారులతో కలిసి శంఖుస్థాపనలు చేసినప్పటికి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఎలాంటి ఉపయోగం లేకపోయిందని ఆయా గ్రామాలు, తాండాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా నల్లగొండ జిల్లా వింజమూరు గేట్ మీదుగా మాడ్గుల మండలంలోని వివిద గ్రామాలు, తాండాలకు సుద్ధపల్లి మీదుగా రాకపోకలు సాగించేందుకు వీలుగా సుద్ధపల్లి వాగుపై వంతేన నిర్మాణం చేపట్టాలని యేండ్ల కాలంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నా అదిగో.. ఇదిగో అంటూ ఊరిస్తున్నారే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదని మండల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. అంతేగాకుండా ఈ వాగుపై పలుమార్లు వర్షాకాలంలో ప్రజలు, వాహనదారులు, రైతులు వరదనీటి బారినపడి తృటిలో ప్రాణాపాయం నుండి బయటపడ్డట్లు వారు పేర్కొంటున్నారు. ఆర్కపల్లి ముత్యాలమ్మ గుడినుండి పడమటి తాండ మీదుగా ఇర్విన్‌కు చేరుకోవడానికి ఏర్పాటు చేసిన రహదారిని బిటిగా మార్చి ఈ రహదారిపై నిర్మించిన కల్వర్టు గతంలో కురిసన వర్షాలకు ధ్వంసమై రాకపోకలు ఇబ్బంది మారడంతో దీనికి మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విధంగా మండలంలోని గిరికొత్తపల్లి – నర్సంపల్లి గ్రామాల మధ్య గుండా పారే మూడు వాగులపై వంతెనలు నిర్మించాలని ఇప్పటికే నర్సంపల్లి, గిరికొత్తపల్లి గ్రామాలతో పాటు సమీప గ్రామాలు, తాండాల ప్రజలు గగ్గోలు పెడుతున్నా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు, ఏ ప్రజాప్రతినిధి స్పందించలేదని ప్రజలు గుర్రుమంటున్నారు.

**_అతీగతిలేని కల్వకుర్తి, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ కాలువల అసంపూర్తి పనులు_**

ఉమ్మడి మహబూబ్‌నగర్ మొదలు, ప్రస్తుత రంగారెడ్డి జిల్లాలోనే వెనకబడ్డ మండలమైన మాడ్గులకు సాగునీరందించేందుకు వీలుగా గత ప్రభుత్వాల హాయంలో మండలంలోని వివిధ గ్రామాల రైతుల భూముల్లో ప్రారంభించిన కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకంతో పాటు నల్లగొండ జిల్లా డిండి నుండి అదే జిల్లా శివన్న గూడెంకు సాగునీరందించేందుకు వీలుగా చేపట్టిన డిండి లిఫ్ట్ ఇరిగేషన్ కాలువల నిర్మాణం యేండ్లు గడుస్తున్నా పూర్తికి నోచుకోక కంపచెట్లతో దర్శనమిస్తూ పాలకుల పనితీరును వెక్కిరిస్తున్నాయి. ఈ క్రమంలో కెఎల్ఐ కాలువల కొరకు మండలంలోని అవురుపల్లి, దొడ్లపహాడ్, నాగిల్ల తదితర గ్రామాల రైతుల భూముల్లో కాలువలు తవ్వి వదిలేయగా డిండిలిఫ్ట్ ఇరిగేషన్ కాలువ నిర్మాణానికి సేకరించిన మండల రైతుల భూములకు ఇంకను కొందరికి ప్రభుత్వం ద్వారా పరిహారం సైతం అందక పడిగాపుల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

**_ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం మారింది... ఇకనైనా సమస్యలు తీరేనో..!_**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవీర్భావ అనంతరం రెండు దఫాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ మద్ధతు అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందగా, తెలంగాణలో సైతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ క్రమంలో ప్రజా ప్రతినిధులు మారారు.. ప్రభుత్వమూ మారింది.. ఇకనైనా మా సమస్యలు గట్టెక్కి ఇబ్బందులు తొలగిపోతే బాగుండని మాడ్గుల మండల ప్రజలు అశపడుతున్నారు.

# గుర్తుతెలియని వ్యక్తులచే 320 కర్జూరా మొక్కలు ధ్వంసం

- మాడ్గుల మండలం అందుగుల శివారులో శనివారం రాత్రి చోటుచేసుకున్న ఘటన
- దుండగులను గుర్తించి కఠిన చర్యలు చేపట్టి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకోలు



మాడ్గుల, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : మాడ్గుల మండలం అందుగుల గ్రామానికి చెందిన పుల్లయ్య అనే రైతు ఇటీవలే 14లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన 10గుంటల భూమిలో టమోటా తోటతో కలిపి 320 కర్జూరా చెట్లు పెంచుతుండగా శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు కర్జురా చెట్ల మొదల్లలో యాసిడ్ లాంటి రసాయనం చల్లడంతో మొక్కలన్ని పూర్తిగా ధ్వసమైనట్లు బాధిత రైతు వాపోయాడు. తమ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవాలని తమకు చింతపల్లిలో ఉన్న ప్లాటును విక్రయించి వచ్చిన సొమ్ముతో పాటు గూడపెట్టుకున్న డబ్బుతో 10గుంటల భూమిని కొనుగోలు చేసి ఇటీవలే 70 వేల రూపాయల వ్యయంతో వ్యవసాయబోర్‌ను సైతం ఏర్పాటుచేసుకొని కూరగాయల సాగుతో కలిపి కర్జూరా మొక్కలను పెంచుతుండగా ఓర్వలేని దుండగులు కర్జూరాను ధ్వంసం చేసినట్లు రైతు పుల్లయ్య కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు కర్జూరా మొక్కలను ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి వారిపై కఠినచర్యలు చేపట్టేలా పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఆయన వివరించారు. కాగా తమ గ్రామ రైతు పుల్లయ్యకు చెందిన కర్జూరా మొక్కలు ధ్వంసం చేసిన దుండగులపై సంబంధితశాఖల అధికారులు వెంటనే స్పందించి కఠినచర్యలు చేపట్టడంతో పాటు రైతు పుల్లయ్యను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల శేఖర్‌గౌడ్ కోరారు.

# ఘనంగా పరిగి ఎమ్మెల్యే టీఆర్ఆర్ విజయోత్సవ ర్యాలీ

★ భారీ గజమాలతో సత్కరించిన అభిమానులు



ప్రజలకు వివాదం చేస్తున్న పరు ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి.





ఎమ్మెల్యే సీటులో ఆసీనులై డాక్టర్ రాం మోహన్ రెడ్డి.

పరిగి మేజర్ న్యూస్ (డిసెంబర్ 10)ః పరిగి ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ టి. రాంమోహన్ రెడ్డి శనివారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆదివారం పరిగి పట్టణానికి వస్తున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. పట్టణంలో కోర్టు చౌరస్తాలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కి స్వాగతం పలుకుతూ అభిమానులు భారీ గజమాలతో సత్కరించారు. విజయోత్సవ ర్యాలీలో డీజే సౌండ్, గుర్రాలు, బ్యాండు చప్పుడుతో కార్యకర్తలు నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

**క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే టీఆర్ఆర్**

పరిగి నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధాంతి పార్థసారథి పంతులు పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు అనంతరం క్యాంప్ కార్యాలయంలో తన చాంబర్లో ఎమ్మెల్యే సీటులో కూర్చున్నారు.

**నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తా....**

**పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి..**

పరిగి నియోజకవర్గం పరిగి శాసనసభ్యులు డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు....

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రజా భవన్ గా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో ప్రగతి భవన్లో సీఎం కేసీఆర్ ప్రజాభవన్ గా మార్చారని అదేవిధంగా నియోజకవర్గంలో ఉన్న క్యాంపు కార్యాలయాన్ని ప్రజాభవంగా మార్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఇకపైన నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలు అధికారిక కార్యక్రమాలకు లేదా వారి సమస్యలు తెలియజేయడానికి ప్రజాభవన్ కి రావచ్చని తెలిపారు. ఎన్నికల తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. గతంలో తన ఎమ్మెల్యే ఉన్నప్పుడు మంజూరు చేసిన పనులను టిఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి ముఖ్యమంత్రి మన జిల్లా నాయకుడు కాబట్టి ఎక్కువ నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి.

# విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం హైదరాబాద్ : త్రిమూర్తుల

ముషీరాబాద్ మేజర్ న్యూస్ : గౌరీశంకర్ అధ్యక్షతన బొజ్జా జయసేన మెమోరియల్ హాలు నందు జ రిగింది. ఈ సభలో సనాతన సాహితి, కవిసింహ పోకూరి కాశీపతి సాహిత్య పీఠంల ఆధ్వర్యంలో రెండు విశిష్ట గ్రంథాల ఆవిష్కరణ వేడుక జరిగిందిమొదటిది విశ్వకర్మ విశిష్ట గ్రంథం.. నాగరఖండం; రెండవది..శ్రీ సిద్ధాంతవు ప్రభాకరాచార్యులుగారు వ్రాసిన శతక సాహిత్యంలో మణిపూస ..కాళికాంబా సప్తశతి. రెండు గ్రంథాలను మహామహోపాధ్యాయ పెదపాటి నాగేశ్వరరావుగారు, ఆచార్య వులికొండ సుబ్బాచారి ఆవిష్కరించారు. మదురై కామరాజ్ యూనివర్సిటీకి యం.ఫిల్. పట్టం కోసం శ్రీ సిద్ధాంత ప్రభాకరాచారి సమర్పించిన పరిశోధన పత్రం వీర్రబహ్మేంద్రస్వామి విరచిత కాళికాంబ సప్తశతి గూర్చిన గ్రంథం శతక సాహిత్యంలో మణిపూస కాళికాంబ సప్తశతి మూడవ ప్రచురణ.. గ్రంథాలు ఆవిష్కరించారుఈ సమావే శంలో విశ్వకర్మను గురించి, విశ్వబ్రాహ్మ ణుల కర్తవ్యాలను వివరిస్తున్న ప్రాచీన గ్రంథం.. నాగర ఖండం గురించి సభాధ్యక్షత వహించిన గౌరీ శంకర్ విశిష్ట అతిథులు డా.పెదపాటి నాగేశ్వరరావు, ముంజంపల్లి వీర్రబహ్మేంద్రచార్య, నూతలపాటి వెంకటరత్నశర్మ, డా.కొల్లోజు కనకాచార్య, ఎట్టోజు లక్ష్మణాచార్య, ఆచార్య సుబ్బాచారిగారలు ప్రసంగి ంచారు. కాళికాంబ సప్తశతి పద్య గ్రంథం గురించి, తన పరిశోధన గురించి శ్రీ సిద్ధాంత ప్రభాకర చారిగారు విపులంగా వివరించారు. సభలో శ్రీ చోడా సాంబశివరావుగారు వితరణ చేస్తున్న విశ్వకర్మ, 2024..నూతన సంవత్సర పంచాంగ కాలెండర్ కూడా ఆవిష్కరణ జరిగింది. సభలో డాక్టర్ పి.శంకర్రావు , పడకండ్ల వెంకటాచార్యులు, గోనుగుంట వీపూరయా చార్యులు, చోడా సాంబశివరావు, కొక్కొండ శంకరయ్య, గోపీనాథ్ ఆచార్య, వై. స్వరూప సాగర్, ఆర్ శివశంకరాచార్యగారు, కపిలవాయి అశోక్ బాబు, క్షీర సాగర్, వి.విద్యాసాగర్, పెంటా శ్రీనివాస్ దంపతులు తది తరులు పాల్గొన్నారు.అక్షర కూర్పరి డా.కోల్లోజు కనకాచార్యని, విశిష్ట అతిథులను, ద్రవ్యదాతలను, సభాపతిని గ్రంథ ప్రకాశకులు పి.చంద్ర ప్రకాశ రావు, గార్లపాటి గురుబ్రహ్మా చార్యులు ఘనంగా సత్కరించారు. గ్రంథ ప్రకాశకు లను శ్రీ ఎట్టోజు లక్ష్మణాచార్య సత్కరించారు. సభాసమన్వయాన్ని సంచాలకులు కె. శివానంద గారు, పూజా కార్యక్రమం శ్రీ గన్నోజు విఠలాచార్య, వందన సమర్పణ కోశాధికారి శ్రీ వులుగిళ్ళ రంగాచార్య జయప్రదంగా నిర్వహించారు.

# రక్తదానం మహాదానం

ఘట్కేసర్, మేజర్న్యూస్(డిసెంబర్, 10): రక్తదానం ఎంతో మంది ప్రాణాలను నిలబెడుతుందని, రక్తందానం చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఘట్కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్రెడ్డి, చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్కేసర్ పట్టణంలోని సెయింట్ అంథోనీస్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం స్కూల్–మెల్విన్జిమ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఘట్కేసర్ కమ్యూనిటీ ఆసుపత్రి రక్తనిధి ప్రతినిధులు దాతల నుంచి రక్తాన్ని సేకరించారు.



ఎంపిపి, చైర్పర్సన్లు విచ్చేసి రక్తదాన శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతూ రక్తం లేక ఎంతో మంది ఇబ్బంది పడుతుంటారని, సరైన సమయంలో రక్తం ఎక్కించగలిగితే ప్రాణాలను కాపాడవ చ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో మొదటి గంటలో రక్తం ఇవ్వగలిగితే చాలా వరకు ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా 50 మంది రక్తదానం చేయగా వారి కి ప్రశంసపత్రాలను అందజే శారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, స్థానిక కౌన్సిలర్ జహంగీర్, పాఠశాల వ్యవస్థాపకులు జార్జ్ క్విల్డెన్, కరస్పాండెంట్ క్రిస్టినాక్విల్డెన్, ప్రధానోపాధ్యాయులు బోగ బాబు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యా యులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆహారపు అలవాట్లపై అవగాహన పెంపొందించాలి: సిఎంఈ సదస్సులో వక్తలు

సోమాజిగూడ/మేజర్ న్యూస్: జీవన విధానంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా అనారోగ్యాల బారిన పడుతున్న ప్రజలను రక్షించేందుకు వైద్యులు ఆహారపు అలవాట్లపై ప్రతి ఒక్కరికి అవగాహన పెంపొందించాలని ఫిజీషియన్స్ అసోసియేషన్ ఫర్ న్యూట్రిషన్ (పిఎఎన్) సదస్సులో డాక్టర్లు సూచించారు. బంజారా హిల్స్ లోని ఓ హోటల్లో పాన్ ఆధ్వర్యంలో వైద్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాన్ మెడికల్ డైరెక్టర్ రెజీనా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బద్రీనాథ్ హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రత్యూష నేరెళ్ల, రాజేందర్, అమ్రిత, ప్రాప్తి లతో కలిసి మాట్లాడారు. ఆహార అలవాట్లు, కనీస శారీరక శ్రమ లేకపోవడంతో యుక్త వయసులోనే బిపి, షుగర్ లాంటి వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలను తేడా లేకుండా ప్రతి ఒక్కరు తీవ్రమైన ఒత్తిడికి గురి కావడం, జింక్ ఫుడ్ సేవించడం, వ్యాయామం లేకపోవడం పెను ప్రమాదానికి దారితీస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకముందే ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వివిధ సామాజిక మాధ్యమాలలో ఎలాంటి శాస్త్రీయ పరిశోధన జరపకుండా ఆహారపు అలవాట్లపై వీడియోలు చేస్తున్నడంతో తికమక కు గురవుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి శాస్త్రీయ పరిశోధన జరిపి ఆహారపు అలవాట్లపై అంతర్జాతీయ స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ప్రాథమికంగా వైద్యులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించామని తెలిపారు. సుమారు మూడు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా వైద్యులు పాల్గొన్నారు.

# పట్నం బీఆర్ఎస్‌లో లుకలుకలు

- మంచిరెడ్డి ఓటమికి స్థానిక నేతలే కారణమంటూ ముఖ్యనేతల వ్యాఖ్యలు
- మనస్థాపానికి గురవుతున్న కిందిస్థాయి నాయకులు
- పార్టీని వీడేందుకు మొగ్గు చూపుతున్న నేతలు
- ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు ఎట్టి లక్ష్మయ్య రాజీనామా
- బీఆర్ఎస్‌లో కార్యకర్తలకు విలువలు లేదని ఆరోపణ



యాచారం, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : పట్నం బీఆర్ఎస్‌లో లుకలుకలు ప్రారంభమయ్యాయి. ఇంతకాలం అంతర్గతంగా ఉన్న నేతల మనోవేదన ఒక్కొక్కటిగా బయటకువస్తున్నాయి. అదికాస్తా కింది స్థాయి నేతల రాజీనామాల వరకు చేరుకుంటుంది. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పరాజయానికి గ్రామాల్లోని స్థానిక నాయకులేనని ఆ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నేతలు వ్యాఖ్యానిస్తుండడం పార్టీ వర్గాల్లో ఆందోళనకు దారి తీస్తుంది. ఒకింత అసహనానికి గురవుతున్న క్షేత్రస్థాయి నాయకులు బీఆర్ఎస్‌ను వీడేందుకు సిద్ధపడుతున్నారు. ఈ క్రమంలోనే మం డల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన ఐదో వార్డు సభ్యులు ఎట్టి లక్ష్మయ్య బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం తన రాజీనామా లేఖను ఆ పార్టీ యాచారం మండల పార్టీ అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్‌కు అందజేశారు. ఈ సంధర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ... సుమారు 25 సంవత్సరాల నుంచి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి వెన్నంటి ఉంటూ... పార్టీ కోసమే పని చేసినట్లు చెప్పారు. గత ఎన్నికల్లో తనకు పార్టీలో ప్రాధాన్యత కల్పించ లేదని అన్నారు. గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి ఎంతో సేవలు అందించినప్పటికీ కనీసం విలువ ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక పార్టీలో చాలామంది కార్యకర్తలు పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం జరిగిందని అన్నారు. ఈ విషయాన్ని పార్టీ ముఖ్య నేతల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పారు. గత 15 సంవత్సరాల నుండి స్థానిక ఎమ్మెల్యే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసినప్పటికీ ఓటమిపాలు కావడానికి కార్యకర్తలే కారణమని నెపం తమపై నెట్టడం ధారుణమని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలకు మనస్థాపానికి గురైన తాను బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఈనెల 12న మాడ్గుల మండలం సర్వసభ్య సమావేశం : ఎంపిడిఓ రాఘవులు



మాడ్గుల, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : మాడ్గుల మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశాన్ని ఈనెల 12న నిర్వహించ నున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాఘవులు తెలిపారు. ఎంపిపి గౌరవరం పద్మారెడ్డి అధ్యక్షతన ఉదయం 10-30గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో మండలం లోని అన్ని ప్రభుత్వశాఖల ప్రగతి నివేదికలను సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ఆయన వివరిం చారు. ఈ సమావేశానికి జిల్లాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు, మండలంలోని అన్ని గ్రామాల ఎంపిటిసి సభ్యులు, మండల కో-ఆప్షన్ సభ్యులతో పాటు అన్ని గ్రామాల సర్పంచ్‌లు, సింగిల్‌విండో చైర్మన్, ఆమనగల్లు మార్కెట్‌కమిటి చైర్మన్‌లు సకాలంలో హాజరు కావాలని ఎంపిడిఓ కోరారు. అదే విధంగా మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలతో నిర్ణీత సమయానికి సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని ఎంపిడిఓ రాఘవులు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం ఎంపిడిఓ రాఘవులు మేజర్‌న్యూస్‌తో మాట్లాడుతూ మండల జనరల్‌బాడీ సమావేశ వివరాలు వెల్లడించారు.

## రాష్ట్ర సాధనలో సారు పాత్ర అనిర్వచనీయం

### ప్రజా పాలన ఏర్పడ్డ నేపథ్యంలో కోదండరామ్‌కు కప్పాటి శుభాకాంక్షలు



రంగారెడ్డి జిల్లా, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10): నాలుగో కోట్ల తెలంగాణ ప్రజల... అరవై ఏండ్ల ఆకాంక్ష, ఉవ్వెత్తున ఉద్యమిస్తున్న ప్రజల సెంటిమెంట్‌ను తమకు అనుకూలంగా మలుచుకునే వారేతప్పా... నిజాయితీగా రాష్ట్ర సాధన కోసం కట్టుబడి పనిచేసే వారు కరువైన సందర్భం అది. అలాంటి కీలక సమయంలో తెలంగాణలో అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసి తెలంగాణ పొలిటికల్ జేఏసీకి చైర్మన్‌గా నియమితులై అటు రాజకీయ పార్టీలను, ఇటు సబ్బండ వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తెచ్చి... అందర్నీ ఏకం చేసి, అందరి అంతిమ లక్ష్యం తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడమే అనే నినాదాన్ని తారా స్థాయికి చేర్చడంలో క్రియా శీలక పాత్ర పోషిం చిన నిజమైన తెలం గాణ ఉద్యమకారుడు, నిఖార్సైన తెలంగాణ ముద్దుబిడ్డ ప్రొఫెసర్ కోదండ రామ్ అని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. ఎందరో అమరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణలో పదేళ్ల తరువాత ప్రజా పాలన చేసే ప్రభుత్వం ఏర్పడ్డ సందర్భంగా ఆదివారం కప్పాటి పాండురంగారెడ్డి కోదండ రామ్‌ని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొంతసేపు వారిద్దరి మధ్య నాటి ఉద్యమ అనుభవాలను నెమరేసుకున్నారు. తెలంగాణలోని రాజకీయ పార్టీలను ఏకం చేసే క్రమంలో ఎన్ని అవమానాలు ఎదురైనా భరించి రాష్ట్ర సాధన కోసం చేసిన కృషిని ఈ సంద ర్భంగా వారు నెమరేసు కున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజలకు సంక్షేమం

- వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి
- మహాలక్ష్మీతో మహిళలకు ఉచిత ప్రయాణంతో జెండా బస్సు ప్రారంభం



కందుకూరు, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమం అందుతుందని వైస్ ఎంపీపీ గంగుల శ మంత ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎన్నికల్లో మేనిఫెస్టోలో ప్రకటించిన 6 గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం ప్రారంభమైన సందర్భంగా ఆదివారం కందుకూరు మండలం నేదునూరులో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి ఎండి అప్జల్ బేగ్ ఆధ్వర్యంలో ఆర్టీసి బస్సుకు పూజలు నిర్వహించి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన 6 గ్యారంటీలలో మహాలక్ష్మి, 10 లక్షలు ఆరోగ్య శ్రీ పథకాలను అమలు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఋణపడి ఉంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అంకగళ్ళ బాలయ్య, గంగుల బలవంత్‌రెడ్డి, పుణ్యమూర్తి, శ్రీశైలం, యండి. అమీన్ బేగ్, బొర్ర సురేష్, అంకగళ్ళ సంజీవ, నీరటి పెంటయ్య, యండి పాషా, అంకగళ్ళ జగన్, మండి ఖాజా, శ్రీరాములు, జంగయ్య, సోయబ్ బేగ్, భాస్కర్‌రెడ్డి, రమేష్, మహేందర్, దర్శన్, సుధాకర్, మహేష్, శ్రీను, కృష్ణా, శంకర్, జగన్, భిక్షపతి, మైసయ్య, కుమార్ గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



ఆమనగల్లు, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన కసిరెడ్డి నారాయణరెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజల నుండి శుభాకాంక్షల వెల్లువలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఆదివారం విఠాయిపల్లి గ్రామానికి చెందిన పెరుమాన్‌డ్ల వెంకట్ రెడ్డి, సుక్క వెంకటయ్య, మాజీ సర్పంచ్ పర్వతాలు, వెంకటేశ్వర్ రెడ్డి పలువురు మర్యాదపూర్వకంగా కలుసుకొని నారాయణరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలుపొందాననీ వారి సేవకు తన శ్రా యశక్తుల కృషి చేస్తానన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని మిగతా నాలుగు గ్యారంటీల్ని వంద రోజుల్లో ప్రారంభిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీకి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అఖండ మెజారిటీతో గెలిపించి ఆ రుణాన్ని తీర్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పూల్యా, లక్ష్మ రెడ్డి, జగన్, కృష్ణ, లింగం, శంకర్, రాజు, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డి విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలి

- నేడు కడ్తాల్ నుండి కల్వకుర్తి వరకు ఎమ్మెల్యే కసిరెడ్డి విజయోత్సవ ర్యాలీ
- ప్రజలు, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ శ్రేణులంతా తరలివచ్చి విజయవంతం చేయాలి
- డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పిలుపు



కడ్తాల్, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన కసిరెడ్డి నారాయణరెడ్డి విజయోత్సవ ర్యాలీ సోమవారం నిర్వహించనున్నట్లు డిసిసి అధికార ప్రతినిధి, ఎంపిటిసిల ఫోరమ్ రంగారెడ్డి జిల్లా గౌరవాధ్యక్షులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం కడ్తాల్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల కృషితో కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొంది శాసనసభలో ప్రమాణ స్వీకారం చేసిన కసిరెడ్డి నారాయణరెడ్డి విజయోత్సవ ర్యాలీని కడ్తాల్ నుండి కల్వకుర్తి వరకు చేపడుతున్నట్లు వివరించారు. నియోజకవర్గ సమస్యల పట్ల పరిపూర్ణ అవగాహన కలిగి కల్వకుర్తిని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం తోలి సారిగా విచ్చేస్తున్న కసిరెడ్డీ నారాయణ రెడ్డికి స్వాగతం పలికేందుకు మండలంలోని అన్ని గ్రామాలు, తాండాల ప్రజలు, కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో మండల కో-ఆప్షన్ సభ్యులు ఎం.డి జహంగీర్ బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, కడ్తాల్ పట్టణ కాంగ్రెస్ అద్యక్షులు రాంచందర్ నాయక్, మాజీ అధ్యక్షులు కందికంటి యాదయ్యగౌడ్, నాయకులు మల్లయ్య, సత్యం యాదవ్, దయాకర్ రెడ్డి, శ్రీను, శ్రీశైలం, క్యామ రాజేష్, భానుకిరణ్, వంశీ శ్రీకాంత్, సేవాదల్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలతో పేదలకు మేలు

చేవెళ్ల, మేజర్‌న్యూస్(డిసెంబర్ 10) ః ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని సత్యసాయి సేవా సమితి చేవెళ్ల కన్వీనర్ రామాగౌడ్, గోపాలచారి అన్నారు. శంకర కంటి ఆసుపత్రి, సత్యసాయి సేవా సమితి, జిల్లా అందత్వ నివారణ సంస్థ సంయుక్తంగా చేవెళ్లలోని సత్యసాయి మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి, సర్జరీలు అవసరమైన వారిని గుర్తించి ఆసుపత్రికి రెఫంచచేశారు. పది మందికి కాటరాక్ట్ సర్జరీలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. శిబిరం ఇంచార్జీ విశ్వమోహన్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# తాండూరులో ఇక నుండి అక్రమ కేసులు, బెదిరింపులు, భూ కబ్జాలు ఉండవు

- ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోవచ్చు
- తాండూరు ప్రాంతం అభివృద్దే తమ నినాదం
- పార్టీలకు అతీతంగా అందరికి అందుబాటులో ఉంటా
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వెల్లడి



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు మేజర్ న్యూస్ (డిసెంబర్ 10)ః తాండూరు ప్రాంతంలో ఇక నుండి అక్రమ కేసులు,బెదిరింపులు,భూ కబ్జాలు,తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావు లేకుండా ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరు పట్టణంలో ఆదివారం నాడు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పాత తాండూరు,మార్వాడీ బజార్,గాంధీ చౌక్,తదితర ప్రధాన కూడలిలా నుంచి ఇందిరా చౌక్ వరకు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తాండూరులో ఇక నుంచి ప్రతిపక్షం, అధికార పక్షం అనే తేడా లేకుండా అందరం అన్నదమ్ముల మాదిరిగా కలిసి ఉంటూ అభివృద్ధిని చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. మునుముందు అభివృద్దే తమ నినాదం అని ఆయన తెలియజేసారు. గతంలో జరిగినట్లు చట్ట వ్యతిరేక కార్య కలాపాలకు ఫుల్ స్టాప్



పడనుందని,ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఉండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాండూరు ప్రాంతం అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఆయన అన్నారు.అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించి తిరుతనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సోనియమ్మ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను చూసి ప్రజలు ఎంతగానో ఆదరించారని,వారి మేలు కొరకు అన్ని పథకాలను అమలు చేస్తామని అధికారం లోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు పథకాలను అమలు చేయడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. పట్టణంలో కానీ, గ్రామాలలో కానీ ఏ చిన్న సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కారం ఉంటుందని,ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టడం తో ఇక నుంచి కొడంగల్,తాండూరు లల్లో అభివృద్ధి శరవేగంతో ముందుకు సాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి రంగానికి అదనపు నిధులు వస్తాయని చెప్పారు.అనంతరం పట్టణ సమీపంలోని ఎస్వీఆర్ గార్డెన్ లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నేతలు, పలువురు ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి తాండూరు పట్టణం తోపాటు నియోజకవర్గం లోని తాండూరు,పెద్దేముల్, యాలాల్, బషీరాబాద్, కోట్ పల్లి, మండలాల నుంచి పెద్ద ఎత్తున నేతలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ధారసింగ్, మురళీకృష్ణ గౌడ్,అబ్దుల్ రావూఫ్, కల్వ సుజాత, ప్రభాకర్ గౌడ్, జనార్దన్ రెడ్డి, ఉత్తమ్ చంద్, అజయ్ ప్రసాద్, రవిగౌడ్, సురేందర్ రెడ్డి, లొంక నర్సింహులు, బాల్ రెడ్డి, వడ్డే శ్రీనివాస్ తోపాటు పలువురు జడ్పీటీసీ లు, ఎంపీటీసీ లు, కౌన్సిలర్లు, సర్పంచ్ లు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాంమోమన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

## ★ గుజ్జా దశరథ్ రెడ్డి



దోమ, మేజర్ న్యూస్ (డిసెంబర్ 10)ః పరిగి నియోజకవర్గంలో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి తమన్నగారి రాంమోహన్ రెడ్డి కి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పదవి ఇచ్చి నియోజక వర్గ అభివృద్ధికి సహకరించాలని గొడగొనిపల్లి (రెవిన్యూ గ్రామం దోర్నాలపల్లి) కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుజ్జా దశరథ్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి మాట్లాడుతూ... గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకై నిరంతరం కృషి చేస్తూ పార్టీ, కార్యకర్తల కొరకై రామ్మోహన్ రెడ్డి అహర్నిశలు కష్టపడ్డారని, 2023వ సంవత్సరంలో రాష్టంలోనే తిరుగులేని పార్టిగా నేడు కొలువుదిరిందని, కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన సీనియర్, జూనియర్ అని లేకుండా ప్రతి కార్యకర్తకు సముచిత న్యాయం చేకూర్చాలని అభిప్రాయపడ్డారు.కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలలో రెండు రోజుల్లోనే రెండు హామీలు అమలు చేయడం హర్షించదగ్గ విషయమని, అదేవిదంగా ఐదు సంవత్సరాల కాంగ్రెస్ పరిపాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా శ్రేయస్సు కొరకై అనేక పథకాలను ప్రవేశ పెట్టి మళ్ళీ అధికారం చేపట్టాలని తెలిపారు.

# అధైర్య పడవద్దు.. అండగా ఉంటా

- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా
- కష్టసుఖాలలో మీ వెన్నంటే ఉంటా
- ప్రజా సమస్యల కోసం పోరాటం చేస్తూనే ఉంటా
- మేడ్చల్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి



కీసర, మేజర్ న్యూస్ (డిసెంబర్ 10)ః పార్టీ నేతలు, కార్యకర్తలెవ్వరు అధైర్య పడవద్దని అందరికి అండగా ఉండి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మేడ్చల్ బిజెపి కంటెస్టెంట్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఘట్కేసర్ మండల ఎంపీపి సుదర్శన్ రెడ్డి బరోసానిస్తున్నారు. ఆదివారం మండల పరిధిలోని చీర్యాల గ్రామ జయ మోహన్ ఫంక్షన్ హాల్లో అసెంబ్లీ కన్వీనర్ అమర మోహన్ రెడ్డి అధ్యక్షతన మేడ్చల్ బిజెపి అసెంబ్లీ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ మేరకు ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ రెడ్డి, మేడ్చల్ బిజెపి కంటెస్టెంట్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఘట్కేసర్ మండల ఎంపీపి సుదర్శన్ రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ నేతలకు, కార్యకర్తలకు కష్టసుఖాల్లో వెన్నంటి ఉంటానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉండి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలియజేశారు. ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పదాధికారులు,రాష్ట్ర నాయకులు, కార్పొరేటర్లు,కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు,వివిధ మోర్చా అధ్యక్షులు,నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

- ఉచిత వైద్య శిభిరంలో **310** మందికి ఉచిత పరీక్షలు
- సర్పంచ్ కొత్తపల్లి నర్సింహారెడ్డి



ధారూర్, మేజర్ న్యూస్ (డిసెంబర్ 10)ః ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదని కెరెల్లి గ్రామ సర్పంచ్ కొత్తపల్లి నర్సింహారెడ్డి అన్నారు.గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని కెరెల్లి గ్రామంలో శ్రీ సత్యసాయి సేవా సమితి కెరెల్లి,మిధాని ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ హైదరాబాద్ వారు సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయించనైనది. మిశ్రధామ నిగమ్ లిమాటెడ్ (మిధాని ) కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ రక్షణశాఖ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద మిధాని ప్రైమరీ హెల్త్ కేర్ ద్వారా పేద ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొత్తపల్లి నర్సింహారెడ్డి మాట్లాడుతూ మెగా ఉచిత



వైద్య శిబిరానికి వివిధ వైద్య నిపుణులు శిశు వైద్యులు, గైనకాలజీ, పల్మనాలజీ, ఈఎన్ టి,ఎముకల వైద్యులు, జనరల్ మెడిసిన్ వైద్యులు ఉచితంగా సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. మిధాని ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ వారు రక్త పరీక్షలు, ఈసిజి, దయాబెటిస్, రక్తపోటుకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారని స్పష్టం చేశారు.రోగులకు ఉచిత మందులను కూడా అందించారని వివరించారు. మెగా ఉచిత వైద్య శిబిరానికి 300 మందికి పైగా గ్రామస్థులు విచ్చేసి ఉచిత వైద్య సేవలు వినియోగించు కోవడం అభినందనీయమని అన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం అయినందుకు అందరికి మిధాని ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ చైర్ పర్సన్ కె.మధుబాల హర్షం వ్యక్తం చేశారు. మెగా ఉచిత వైద్య శిబిరం దిగ్విజయంగా కొనసాగేందుకు సహకారం అందజేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెరెల్లి శ్రీ సత్య సాయి సేవా సమితి అధ్యక్షుడు రఘునందన్, కార్యదర్శి ఎం.ప్రేమ్ కుమార్, కన్వీనర్ రామకృష్ణారెడ్డి, తాండూరు కన్వీనర్ వీరేశం గౌడ్, జడ్ఓఐ ఆసుపత్రి డాక్టర్ వెంకటరామ్ నర్సింహారెడ్డి, అంకురా ఆసుపత్రి డాక్టర్ సరిత, భాస్కర ఆసుపత్రి డాక్టర్ కవిత ,డాక్టర్ మహేష్, డాక్టర్ హేమచంద్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర : భారీగా తరలివచ్చిన భక్తులు

ధారూర్, మేజర్ న్యూస్ (డిసెంబర్ 10)ః క్రిస్టియన్ జాతర గత ఆరు రోజుల నుండి ప్రారంభమై నేటితో ముగిసింది.ఈ జాతరకు తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో జన సంద్రోహరంగా మారింది. ఆదివారము ఉదయం ఆరాధన ముగించుకొని భజనలతో యేసుక్రీస్తు నామ స్వరణతో మారుమ్రోగింది. జాతర నిర్వాహకులు భక్తులు ముడుపులు చెల్లించిన గొర్రెలు మేకలు,కల్లను వేలంపాట వేశారు.ఆ వేలం పాటకు భక్తుల నుండి విశేష స్పందన లభించింది. పోటాపోటీన వేలం పాట పాడి ఏసుక్రీస్తుకు ముడుపు చెల్లించిన వాటిని వేలం పాటలో చేజిక్కించుకొని సంతోషం వ్యక్తం చేశారు.



జాతరలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు.

## నేటి నుండి ప్రజావాణి ప్రారంభం : కలెక్టర్ నారాయణ రెడ్డి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేయబడిన ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ఈనెల 11న (సోమవారం) నుండి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించబడే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

## 7వ ఎలైట్ ఉమెన్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్



మణికొండ, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : మణికొండ మున్సిపల్‌లోని షెక్‌పేట బాక్సింగ్ క్లబ్ ఆద్వర్యంలో 7వ ఎలైట్ ఉమెన్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 2023 కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిఎస్. యమ్‌జిఎటి చైర్మన్ బి. వినయ్, మాజీ ఎంపిటీసి రాఘవరెడ్డి, ఇండియన్ రైల్వే బోర్డు మెంబర్ ఉమారాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన వారు డిసెంబర్ 20 నుండి 27వరకు ఉత్తరప్రదేశ్ నోయిడాలో జాతీయ బాక్సింగ్ చాపియన్ షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ కర్యాక్రమంలో తెలంగాణ బాక్సింగ్ అధ్యక్షులు బాబురావు, తెలంగాణ ఒలంపిక్ ట్రెజరర్ మహేష్, తెలంగాణ బాక్సింగ్ సెక్రటరీ రవిందర్, బిడి మన్మోహన్, ఎల్లయ్య, లక్ష్మణ్, వరల్డ్ చాంపియన్ నికత్ జరిన్ తండ్రి జమ్మీల్, బిజెపి హైదరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఇంద్రసేనారెడ్డి, షెక్పేట బాక్సింగ్ క్లబ్ కోచ్ వినేష్‌బాబు, శివకుమార్, సన్నీ, శశాంక్, లోకేష్, రఘువీర్, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన జల్‌పల్లి మైనార్టీ నాయకులు



జల్‌పల్లి, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : మహేశ్వరం నియోజకవర్గం నుంచి బిఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా విజయం సాధించిన మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి నివాసానికి వెళ్లి పూల బొకే ఇచ్చి అభినందనలు తెలిపిన జల్ పల్లి మున్సిపాలిటీ బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ షర్ఫుద్దీన్, హమీద్ భాయ్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీ మైనార్టీ నాయకుల అభివృద్ధికి సబితా ఇంద్రారెడ్డి కృషి చేశారని అన్నారు.రాబోయే రోజులలో మైనార్టీ సంక్షేమాల కోసం మరింతగా కృషి చేయాలని సబితా రెడ్డికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో షాకీర్ భేగ్, అంజద్ ఖాన్,సయ్యద్ ఫిరోజ్, సూరెడ్డి కృష్ణారెడ్డి, అలీ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం



జల్‌పల్లి, మేజర్‌న్యూస్ (డిసెంబర్10) : మామిడిపల్లి శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సత్యనారాయణ స్వామి వ్రతం భక్తులచే ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం చివరి రోజు కావడంతో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లి శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమం జరిపించుకున్నారు. ఆలయంలోని వేద పండితులు సత్యనారాయణ స్వామి వ్రతంలోని ఐదు అధ్యాయంలోనీ కథలు భక్తులకు వివరించారు.ఈ సందర్భంగా మామిడిపల్లిలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.భక్తులు పెద్ద ఎత్తున సత్యనారాయణ స్వామి పూజ కార్యక్రమంలో పాల్గొనీ తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం ఆలయంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.



*గండిపేట్ : రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రకాష్‌గౌడ్ నాల్గవ సారి గెలు పొందడంతో ఆదివారం కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిం చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కిషోర్‌రెడ్డి, మస్తాన్ షరీఫ్, ఠాకూర్, మిస్బా ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.*

## కేసీఆర్ పాలనలో ప్రభుత్వ వ్యవస్థల నిర్బంధం

- ఏఎన్ఎం మొదలుకొని కలెక్టర్ వరకు ఏమీచేయలేని పరిస్థితి
- జిల్లా వైద్యాధికారులు, ప్రజా ప్రతి నిధులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : కేసీఆర్ పాలనలో ప్రభుత్వ వ్యవస్థలన్నింటిని నిర్బంధంలో పెట్టారని, ఏఎన్ఎం మొదలుకొని కలెక్టర్ వరకు ఏమీచేయలేని పరిస్థితి నెలకొందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జిల్లా వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రివద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో నిర్బంధ పాలన సాగిందని, కలెక్టర్ మొదలుకొని ఏఎన్ఎం వరకు నిర్బంధంగా సేవలు అందించారన్నారు. కానీ నేడు కాంగ్రెస్ పాలనలో వారందరికీ విముక్తి లభించిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.10లక్షల వరకు ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచిందన్నారు. ఆరోగ్యశ్రీలో 1383రోగాలకు చికిత్సలు, సర్జరీలు 289 రుగ్మతలకు వర్తిస్తుందన్నారు. రూ.5లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పరిమితి కాంగ్రెస్ పాలనలో రూ.10లక్షలకు పెంచడం జరిగిందని, ప్రభుత్వ నిర్ణయంతో నిరుపేదలు కార్పోరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, షాద్‌నగర్ ఆర్డీఓ వెంకటమాధవరావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఫరూఖ్‌నగర్ జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, కేశంపేట జెడ్పీటీసీ తాండ్ర విశాల, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప అనుగ్రహం ప్రజలందరికి ఉండాలి





- అయ్యప్ప మాలధారణ భక్తులకు జిల్లెల రాంరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం
- ముఖ్య అతిధులుగా హాజరైన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

నందిగామ, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10): అయ్యప్పస్వామి అనుగ్రహం ప్రజలందరికి ఉండాలని షాద్‌నగర్ నూతన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు. అన్ని దానాల్లోకెల్లా అన్నదానం పుణ్య కార్యమని , అయ్యప్పమాలధారణ భక్తులకు అన్నదానం చేపట్టడం అత్యంత అదృష్టమని ఆయన పేర్కొన్నారు. నందిగామ మండల కేంద్రం సమీపంలోని అయ్యప్ప దేవాలయంలో ఆదివారం నందిగామకు చెందిన జిల్లెల రాంరెడ్డి ఆధ్వర్యంలో మాలధారణ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు ముక్య అతిధులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాత జిల్లెల రాంరెడ్డితో కలిసి మాలధారణ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి అభినందించారు. అనంతరం అయ్యప్ప ఆలయకమిటి సభ్యులు, మాలధారణ గురుస్వాములు, భక్తుల ఆధ్వర్యంలో వీర్లపల్లి శంకర్, ప్రతాప్‌రెడ్డిలను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, భక్తులు, నాయకులు హరి జీవన్, లక్ష్మయ్యయాదవ్, సుదర్శన్‌గౌడ్, జంగ నర్సింహులు, వేణు గోపాల్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, తులసిరాం నాయక్, కుమారస్వామిగౌడ్, కొమ్ము కృష్ణ, సత్తయ్య,ప్రభాకర్, నిరంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గంధంగూడలో నిరుపయోగంగా పార్కు



గండిపేట్, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : గంధంగూడ పరిధిలోని తిరుమలహిల్స్ కాలనీలో నిరుపయోగంగా మారిన మినీ పార్కు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న తిరుమల హిల్స్ కాలనీని ఆదుకునే నాధుడే లేకుండా పోయారు. కార్పొరేటర్ ఏ ఒక్క రోజు కూడా సందర్శించి బాగోగులు తెలుసుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ పార్కు రెండు సంవత్సరాల క్రితం పనులు మొదలు పెట్టడం జరిగింది. శిలాఫలకం కూడా వేయలేదు. నామ మాత్రంగా మాత్రమే పనులు మొదలు పెట్టి తాళం వేసి వదిలేశారు. కాలనీవాసులు కమిషనర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా కూడా పట్టించుకోలేదని తెలుపుతున్నారు. వెరసి నిత్యం పక్కనే ఉన్న డంపింగ్ యార్డు నుంచి అనేక రకాల పాములు, క్రిములు, దోమలు పార్కులోకి చేరి చుట్టుపక్కల కాలనీవాసులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. కనీసం లోపల ఉన్న చెట్లను సైతం సక్రమంగా కటింగ్‌చేయడం లేదు. కాలనీవాసులకు కూడా మెయింటెనెన్స్ కోసం ఇవ్వడం లేదు. లోపల పిచ్చి మొక్కలు గడ్డి విపరీతంగా పెరిగి పాములకు నివాసయోగ్యంగా మారింది. ఎన్ని సార్లు అడిగినా, కాలనీవాసులకు స్వచ్ఛందంగా శుభ్రం చేయడానికి కనీసం తాళం కూడా తీయడానికి సిబ్బంది సహకరించడం లేదు.




## ఎమ్మెల్యే ప్రకాశ్‌గడ్‌ను కలిసిన మున్సిపల్ బిఆర్ఎస్ నాయకులు



మణికొండ, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : రాజేంద్రనగర్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలుపోందిన ప్రకాశ్‌గౌడ్‌ని మణికొండ మున్సిపల్‌లోని మున్సిపల్ బిఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ రామక్రిష్ణారెడ్డి, అధ్యక్షులు బుద్దొలు శ్రీరాములు ఆద్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొని ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్‌కు మంచి రోజులు వచ్చాయి

- త్వరలో వికారాబాద్ అభివృద్ధికి నిధుల వరద తెస్తాం..
- వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్



పథకాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, నాయకులు



వికారాబాద్ రూరల్, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10):

వికారాబాద్ ప్రాంతానికి మంచిరోజులు వచ్చాయని తొందరలోనే వికారాబాద్ అభివృద్ధికి నిధుల వరద తెస్తామని వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలలో భాగంగా మొట్టమొదట ప్రకటించిన మహాలక్ష్మి పథకం, రాజీవ్ ఆరోగ్య శ్రీ భీమా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మరో 90 రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలు మమ్మల్ని నమ్మి గెలిపించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు మంచి పాలన అందించే ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డిఓ విజయ లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, వికారాబాద్ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ అర్థ సుధాకర్ రెడ్డి, నాయకులు ఎర్రవల్లి జాఫర్, అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న నాయకులు



దోమ, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10): బొంపల్లి పెద్ద తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ వెంకట్ అల్లుడు విహాహ వేడుకలో పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బొంపల్లి కాంగ్రెస్ పార్టీ పెద్దలు అంతిరెడ్డితో పాటు గ్రామా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,యువకులు చంద్రశేఖర్, రాము, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏస్ జి ఎఫ్ అండర్ 19 జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు హరిక



విదార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దోమ, మేజర్ న్యూస్ (డిసెంబర్ 10): పరిగి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం సిఈసి చదువుచున్న మంగలి హరిక జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కుమారస్వామి తెలిపారు. ఈ జాతీయస్థాయి ఖోఖో పోటీలు మహారాష్ట్ర రాష్ట్రంలోని నాసిక్‌లో డిసెంబర్ 12వ తేదీ నుండి డిసెంబర్ 16 వరకు జరుగుచున్నయని హరికకు ప్రత్యేకమైన కోచింగ్ ఇచ్చిన కోచ్ జి.గోపాల్ తెలిపారు. జాతీయస్థాయి ఖొ ఖొ పోటీలకు ఎంపికైన హరికను పరిగి ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు సాయినాథ్ భాస్కరయోగి సతీష్ ప్రభాకర్ గోపాల్, విజయ్, కళాశాల అధ్యాపక బృందం కళాశాల విద్యార్థుని విద్యార్థులు అభినందించారు.

## నేటి నుండి ప్రజావాణి ప్రారంభం



వికారాబాద్‌జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (డిసెంబర్ 10): తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేయబడిన ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ఈనెల 11న (సోమవారం) నుండి యధా విధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించబడే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

## మృతురాలి అంత్యక్రియలకు ఎస్‌కేఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న స్థానిక నాయకులు

మర్పల్లి, మేర్ న్యూస్ (డిసెంబర్ 10): మర్పల్లి మండల పరిధిలోని బుచన్ పల్లి గ్రామానికి చెందిన పంచలింగాల్ బాగమ్మ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి ఆదివారం బాగమ్మ అంత్యక్రియలకు రూ. 5000 పంపించగా స్థానిక నాయకుడు వెంకట్రామిరెడ్డి గ్రామస్తులతో కలిసి మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్‌కేఆర్ పంపిన 5 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, బిచ్చిరెడ్డి, శ్రీనివాస్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రజా వాణి షురూ...

- ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కొనసాగింపు
- కలెక్టర్ గౌతం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (డిసెంబర్ 10): ఈ నెల 11 సోమవారం నుంచి మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ప్రజావాణి ప్రారంభం కానుంది. ఇందుకు సంభందించి జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రజా వాణి కార్యక్రమం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గౌతం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోనిప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతం సూచించారు.

## జెడ్పి చైర్‌పర్సన్ సునితా రెడ్డిపై అసభ్యకర పోస్టు పెట్టిన రఘుమారెడ్డి అరెస్టు

- జెడ్పి చైర్‌పర్సన్‌పై బాధకరమైన పోస్టును పెట్టి వైరల్ చేసిన రఘుమారెడ్డిని అరెస్టు చేసిన పోలీస్‌లు
- తాండూరు డిఎస్పి శేఖర్ గౌడ్ వెల్లడి



తాండూరు, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10): వికారాబాద్ జిల్లా చైర్‌పర్సన్ సునితా మహేందర్ రెడ్డిపై వారం రోజుల క్రితం అసభ్యకర పోస్టులు పెట్టి సోషల్ మీడియాలో వైరల్ చేసిన తాండూరు తాజా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి దగ్గరి బందువు అయిన రఘుమారెడ్డిని ఎట్టకేలకు ఆదివారం సాయంత్రం తాండూరు పోలీస్‌లు అరెస్టు చేశారు. రఘుమారెడ్డి జెడ్పి చైర్‌పర్సన్‌తో పాటు మాజీ మంత్రి మహేందర్‌రెడ్డిలపై కూడా తప్పుడు పోస్టులు పెట్టడం, గతంలో కూడా పలువురు నేతలపై తప్పుడు పోస్టులు పెట్టడంతో ఇదివరకు ఆయనపై చాలా ఫిర్యాదులు అందాయి. ఈ కోనంలోనే రఘుమారెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తాండూరు డిఎస్పి శేఖర్ గౌడ్ ఆదివారం రాత్రి వెల్లడించారు. ఎవరైనా తప్పుడు పోస్టులు పెడితే చట్టరిత్య తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## పూర్వ విద్యార్థిని కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు



డిపాజిట్ బాండ్ అందజేస్తున్న చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి.

ఘట్‌కేసర్ రూరల్, మేజర్‌న్యూస్(డిసెంబర్ 10) :

మానవత విలువలు పోతున్న సమయంలో నాటి తోటి విద్యార్థిని మరణిస్తే ఆమె పిల్లలకు ఆర్థికంగా అండగా నిలవడం అభినందనీయమని పోచారం మున్సిపాలిటీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-2006 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమ తోటి విద్యార్థిని అతియా బేగం మరణించగా ఆమె సంవత్సరం కుమారుడి పేరు మీద బ్యాంకులో40 వేల ఫిక్స్డ్ డిపాజిట్ చేశారు. ఈ మేరకు చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి 5వేలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి 5వేలు, మరో ఇద్దరు పూర్వ విద్యార్థులు ఉషా, కళ్యాణ్‌లు 40వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆదివారం ఆమె కుటుంబ సభ్యులకు అందించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న తోటి మిత్రురాలు కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడం ఎంతో మం దికి స్ఫూర్తి దాయకమని అన్నారు. యువత స్వార్థం వీడి సామాజిక ఆలోచన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యా నాయక్, కౌన్సిలర్ చింతల రాజశేఖర్, బీజేపి నాయకులు తౌర్యానాయక్, పూర్వ విద్యార్థులు నానావత్ ఉపేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చేవెళ్ల, మేజర్‌న్యూస్(డిసెంబర్ 10)ః ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాం.... చదువులమ్మ చెట్టు నీడన అంటూ.... ఓ సినీ కవి రాసిన పాటను వారు నిజం చేశారు.సుమారు 18ఏళ్ల తర్వాత వారందరూ ఒకచోట కలుసుకున్నారు. చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్న పాఠశాలలో 2005-2006 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం కౌకుంట్లలోని జడ్పీహెచ్‌ఎస్‌లో సమావేశం నిర్వహించుకున్నారు. మొత్తం 120మంది విద్యార్థులకు గాను 60మంది కార్యక్రమానికి హాజరయ్యారు.ముందుగా ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని పరిచయం చేసుకున్నారు. ఒక్కొక్కరు ఒక్కో రంగాల్లో స్థిరపడినట్లు తెలిపారు. 18 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం సంతోషంగా ఉందని, ఎన్ని పనులు ఉన్నా పక్కనపెట్టి స్నేహితులను కలుసుకోవడానికి ఇక్కడికి వచ్చినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. సమ్మేళనానికి హాజరైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వందనం సమర్పించారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే శంకర్ దంపతుల ప్రత్యేక పూజలు



షాద్‌నగర్, మేజర్ న్యూస్ (డిసెంబర్ 10) : ఫరూఖ్ నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామ పరిధిలో వెలిసిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో షాద్‌నగర్ ఎమ్మెల్యేగా వీర్లపల్లి శంకర్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు స్వామివారికి అభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు సంగయ్యస్వామి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులను శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సజ్జల కాశీనాథ్, సజ్జల భువనేశ్వర్, అగ్గనూరు బసవేశ్వర్, కొంకళ్ల చెన్నయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మక్తగూడలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఘన స్వాగతం



కొత్తూరు, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : షాద్‌నగర్ ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రమాణస్వీకార అనంతరం తొలిసారిగా కొత్తూర్ మండలం మక్తగూడ గ్రామానికి విచ్చేసిన వీర్లపల్లి శంకర్ కు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి తిలకం దిద్ది ఆహ్వానించారు. ఈ సందర్భంగా మక్తగూడ గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరుతూ ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు గొంగళ్ళ హరినాథ్ రెడ్డి, మాజీ ఎంపిపి వేణుగోపాల్ గౌడ్, కొత్తూరు మండల ఓబిసి సెల్ అధ్యక్షులు వడ్డె శేఖర్, మాజీ సర్పంచ్ రాందాస్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ దయ్యాల మల్లేష్, నాయకులు అలుగాని బాలయ్య, వార్డు సభ్యులు యాసారం లక్ష్మయ్య, వార్డు సభ్యులు జర్పుల రవి, బోకుల రాజు, ఎస్.డిఅమీర్, పి.వెంకటేష్, డి.నర్సింహ్మా, డి.శ్రీను, ఎస్ డి.ఖయ్యూమ్, ఎ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వామి మాల ఎంతో పవిత్రమైనది : వై.అమరేందర్ రెడ్డి



జల్‌పల్లి, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10) : అయ్యప్ప స్వామి మాల వేసుకొని అయ్యప్ప భక్తులు ఎంతో పవిత్రంగా నియమయిష్టలతో కఠోర దీక్షతో పూజలు చేసి అయ్యప్ప కృపకు పాత్రులు అవుతారని అన్నారు మహేశ్వరం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, పిసిసి కార్యదర్శి యేలిమేటి అమరేందర్ రెడ్డి. ఆదివారం నాడు మల్లాపూర్‌లోని వైఎఆర్ గార్డెన్ లో మన్నే సదానంద రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి పూజలో పాల్గొన్న అమరేందర్‌రెడ్డికి గురుస్వాములు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ. నియమ నీష్టాలతో అయ్యప్ప భక్తులు 45 రోజులు స్వామి మాల వేసుకుని కఠోర దీక్ష పూని శబరిమల వెళ్తారు. అయ్యప్ప కృప దీవెనలు ప్రజల అందరిపై ఎల్ల వేళల ఉండాలని అయ్యప్ప స్వామిని కోరుకున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో మన్నే బలవంత రెడ్డి, వంగేటి మధుసూదన్ రెడ్డి, అరవింద గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బద్దం మల్లారెడ్డి, మేకల సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు



జల్‌పల్లి, మేజర్‌న్యూస్ (డిసెంబర్10) : మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన సబిత ఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన జల్‌పల్లి మున్సిపాలిటీ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు. జల్‌పల్లి మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ కొండల్ యాదవ్, ఆధ్వర్యంలో పహాడి షరీఫ్ బిఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబిత ఇంద్రారెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారితో సబితా రెడ్డి మాట్లాడుతూ. ఈ ఎన్నికల్లో అభివృద్ధి సంక్షేమానికి నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టారన్నారు. వచ్చే ఐదేళ్లు నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు ఈ సూర్య కుమార్ గౌడ్, మహమ్మదీయ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు హమీద్ ఖాన్,ఉపాధ్యక్షులు ఖదీర్ భాయ్, బిఆర్ఎస్ సీనియర్ లీడర్లు ఆర్ సతీష్ కుమార్, విశాల్ గౌడ్, మీనాజ్, అమీర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీల రూపకర్త జానయ్య

- కాంగ్రెస్ విజయానికి కృషి చేసిన వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌కు సీఎం రేవంత్ అభినందనలు
- వర్సిటీ ఉపకులపతి పదవికి పరిశీలనలో ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య పేరు



రాజేంద్రనగర్, మేజర్‌న్యూస్ (డిసెంబర్ 10): ప్రతిష్టాత్మకమైన రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ, ఆర్థిక శాస్త్రంలో సీనియర్ శాస్త్రవేత్త ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీలో కీలక పాత్ర పోషించారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రాచుర్యం పొందిన ఆరు గ్యారెంటీల కమిటీలోనూ ఆయన కీలక సభ్యుడిగా కొనసాగారు. అలాగే తనకు గల వ్యవసాయ శాస్త్ర పరిజ్ఞానం కూడా తోడవడంతో రైతుకు సంబంధించిన రైతు భరోసా లాంటి కీలకమైన అంశాలలో తన సలహాలు, సూచనలను పార్టీ మేనిఫెస్టోలో పొందుపరచడంలో ఆయన పాత్ర ఎంతో ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను అభినందించారు. ఇటీవల తెలంగాణ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం అల్దాస్ జానయ్యను తన ఇంటికి పిలిపించుకొని ప్రత్యేకంగా అభినందించి ధన్యవాదాలు తెలిపారు. రానున్న ప్రభుత్వంలో కూడా ఆయన సేవలు అవసరం ఉంటాయని సీఎం వ్యాఖ్యానించినట్లు ఈ సందర్భంగా తెలిసింది.

**వ్యవసాయ రంగంపై ప్రత్యేక ప్రత్యేక దృష్టి**

అభయ హస్తం అమలుకు ఉపక్రమణ. 6 గ్యారంటీల్లో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం, మహాలక్ష్మి పథకం ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఆరోగ్యశ్రీ కింద 5 లక్షల రూపాయలు నుంచి 10 లక్షల రూపా యలు పెంచుతూ... మోకాలు మార్పిడి లాంటి క్లిష్టమైన శస్త్ర చికిత్సల తోపాటు 1600 రకాల వైద్య సేవలు పేదలకు కార్పోరేట్ స్థాయిలో అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో ఎక్కడికైనా ఎప్పుడైనా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు, చిరు వ్యాపారులు, ట్రాన్స్‌జండర్లు ప్రయాణించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో కీలక వ్యవసాయ రంగం, రైతు సంక్షేమంపై దృష్టి సారించేందుకు సీఎం సమాయత్తమ వుతున్నారు.

**వర్సిటీ ఉపకులపతి పదవికి పరిశీలన**

ఇప్పటికే సలహాదారులను రద్దు చేసిన దృష్ట్యా... ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలన ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం విస్తృత కసరత్తు చేస్తోంది. గత ఏడాది పైగా ఖాళీగా ఉన్న యూనివర్సిటీ ఉపకులపతి పోస్టు భర్తీ చేసేందుకు అర్హులైన, సమర్థులైన శాస్త్రవేత్తల పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన వ్యవసాయ, ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య పేరు పరిశీలిస్తున్నట్లు సమాచారం. శాసనసభ ఎన్నికల సమయంలో ఎన్నికల మ్యానిఫెస్టో రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు. ధరణి పోర్టల్‌లో అన్యాయానికి గురైన రైతులకు న్యాయం చేయడం సహా... ఆ లోపాలు సవరించడం ద్వారా ప్రత్యామ్నాయంగా భూమాత పేరిట న్యాయం చేయాలని మ్యానిఫెస్టోలో పొందుపరిచారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం, రైతులు, కౌలు రైతుల సంక్షేమం, ఇతర స్థితిగతులు మెరుగుపడేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పథకాలు, ప్రజా పరిపాలన వంటి అంశాలపై రూపొందించిన సిఫారసులు ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. రైతుబంధు పథకానికి ప్రత్యామ్నాయంగా రైతు భరోసా సాయం, మార్కెటింగ్, ధాన్యం సేకరణ, గిట్టుబాటు ధరల కల్పన, పంట బీమా వంటి అంశాలపై కూడా పలు సూచనలు చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో అల్దాస్ జానయ్యకు డాక్టర్ లింగం యాదవ్, డాక్టర్ రియాజ్ తదితరులు సహకరించారు. కాంగ్రెస్ పార్టీ నేత వేం నరేందర్‌రెడ్డి నేతృత్వంలో ఇది సాగింది. ఈ నేపథ్యంలో ఆయన సేవలు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి యోచిస్తున్నారు. అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థల్లో సేవలందించిన అనుభవం, విదేశీ వ్యవసాయ, ఆర్థిక వ్యవస్థ, విధానాలపై అపార అనుభవం కలిగిన జానయ్యను వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమించే విషయం సీఎం పరిశీలనలో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరో రెండు నెలల్లోగా శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నీరజా ప్రభాకర్, పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ రవీందర్‌రెడ్డి పదవీ కాలం కూడా ముగియన్న నేపథ్యంలో... ఇప్పటికే పలువురు ఆయా పోస్టులపై ఆకస్తి ప్రదర్శిస్తున్నారు. తమ మార్గాల్లో లాబీయింగ్‌లో నిమగ్నమై ఉన్నారు.